# ప్రేమ-పన్నాగం

అమర్



'ఏదో ఏదో ఏదో ఏదో ఔతున్నది— ఇదే ఇదే ఇదే ఇదే బాగున్నదీ' రాగం తీస్తూ జడ అల్లుకుంటూంది మంజు. 'అయ్యిందామ్మా, అలంకరణా! త్వరగా బయల్దేరుతావా! లేదా' విసుక్కుంటూ వచ్చింది అనూరాధ. 'పదపదవె వయ్యారి అనురాధా'—పాడుకుంటూ రాధ వెనుక బయల్దేరింది మంజు. ఇద్దరూ స్టేషన్‌కి చేరుకునేసరికే ట్రైన్ వచ్చివుంది ప్లాట్‌ఫారమ్‌మీద. ఎక్కేజనం దిగే జనం. రద్దీగా వుంది ప్లాట్‌ఫారమ్. ఒక్కో కంపార్ట్‌మెంట్ వెతుకుతూ నడవసాగేరు స్నేహితురాళ్ళిద్దరూ.

రాధ బావ మధుబాబు డాక్టరేట్ పుచ్చుకుని విశాఖపట్నంలో ప్రాక్టీస్ పెట్టడానికి వస్తున్నట్టు ఆ రోజే టెలిగ్రాం ఇచ్చాడు. రాధ విశాఖలోనే హాస్టల్‌లో వుంటూ చదువుకుంటూంది. రాధ క్లాస్‌మేట్ మంజు. ఇద్దరూ ఒక్కరూమ్‌లోనే వుంటూన్నారు. ప్రాణస్నేహితురాళ్ళు.

'ఏడనున్నాడో! ఎక్కడున్నాడో నీ చక్కలరేడు! ఏడనున్నా...' మోచేతితో మంజుని పొడిచింది రాధ 'స్టేషన్‌లో కూడ ఏమిటే నీ రాగాలు. కాస్త నోరు మూసుకో' అంటూ. టక్కున నోరు మూసుకుంది మంజు. ఇంతలో సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోంచి దిగుతూన్న ఒక వ్యక్తిని చూచి 'ఏయ్ మధూ!' అంటూ పరిగెత్తింది రాధ. 'హమ్మయ్య! వచ్చావా! రాలేదేమో అనుకున్నాను' సామాన్లు దింపుతూ మంజును చూసి 'అన్నట్టు వీరు...' అర్ధోక్తిలో ఆగి ప్రశ్నార్థకంగా చూశాడు మధు.

'అం చెప్పడం మరిచాను. ఈవిడగారు మై క్లాస్‌మేట్, రూమ్‌మేట్ అండ్ మై బెస్ట్ ఫ్రెండ్ మిస్ మంజులా' పరిచయం చేసింది రాధ. 'ఓ! నమస్తే!' సమాధానంగా చేతులు జోడించి ఊరుకుంది మంజు. దారంతా ఏదో హస్కు కొడుతూ నడుస్తున్నారు రాధా మధు. మౌనంగా అనుసరిస్తూంది మంజు. అప్పటికి జ్ఞాపకం వచ్చింది కాబోలు, రాధ వెనుతిరిగి అంది 'ఏమోయ్! మూగనోము పట్టావా ఏం? నీ రాగాలేమైనాయ్? అన్నట్టు మధూ! మా మంజు ఎంత చక్కగా పాడుతుందను కున్నావ్

'అలాగా! నాకెప్పుడైనా మీ పాట వినిపించాలి మరి' మంజువైపు తిరిగి చనువుగా అన్నాడు మధు.

నుదురు కొట్టుకుంటూ అంది రాధ 'అయ్యో రాతా! కొత్తగా ఒకపాట వినిపిస్తుందా! అది నోరువిప్పితే రాగాలే వస్తాయ్ మాటల కన్నా. విని విని విసుగెత్తి పోవాలి మనం.'

'ఊ హూఁ అలాగా! అలా వుంటేనే మంచిది. మన బాధలన్నీ మరిపించేదీ, ఆరోగ్యాన్ని కలిగించేదీ అయిన మంచి ఔషధం సంగీతమే! తెలుసా.'

'సరి సరి! ఈ డాక్టరు బాబూ, ఆ రాగాలమ్మా ఇద్దరూ కలిస్తే ఇక రోగాలు మన జోలికే రావు' ముగ్గురూ నవ్వుకున్నారు.

'ఏయ్ మంజూ! ఏమిటలా ముంగిలా వున్నావ్! మాట్లాడవేం?'

'నోరు మూసుకోమన్నావ్‌గా!' మూతి సున్నాలా చుట్టింది మంజు. రాధా మధు ఫక్కుమని నవ్వారు.

* * *

'మంజూ!'

ఏదో చదువుకుంటూన్నదల్లా తిరిగి చూసింది 'ఏమిటి?' అన్నట్టుగా.

'నీకు ఓ విషయం చెప్పాలి' మెల్లిగా అంది రాధ.

'ఏమిటో?'

'నేను ఓ సమస్యలో చిక్కుకున్నాను. అదెలా పరిష్కరించాలో అర్థం కావడం లేదు.'

పుస్తకం పడేసి గిర్రున వెనక్కి తిరిగింది మంజు. 'నీకా! సమస్యా! నిజమా!! ఏదీ ఏదీ చెప్పు విందాం!' కుతూహలంగా అడిగింది.

'వేళాకోళం కాదుగానీ విను చెప్తున్నా. మా అమ్మా నాన్నా అందరూ మా మధు బావకి నన్నిచ్చి పెళ్లిచేయాలనుకుంటున్నారు. మరి నా కిష్టంలేదు. ఎలా?'

ఆశ్చర్యంగా కొద్దిసేపు నిశ్శబ్దంగా వుండిపోయింది మంజు. 'అదేమిటే! నీ కిష్టం లేదూ! ఏం? ఎందుకని?'

'చాలోయ్! నీ పాట. నీకు రవిగారు తెలుసుకదూ?'

'రవిగారా! రవిగారంటె ఆ కవిగారేనా?'

'అవును. మే మిద్దరం పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాం. కాని మా యింట్లో అంతా వచ్చినా ఒప్పుకోరు అతన్ని చేసుకోవటం. రవికి కూడ వాళ్ల వాళ్లు వేరే సంబంధం చూస్తున్నారట!' దీనంగా అంది రాధ.

మామూలు కథే అన్నట్టు తేలిగ్గా నవ్వేస్తూ అంది మంజు. 'ఓస్! ఇదేనా! అందుకని నేను చెప్పేదేమంటే వెంటనే మధును పెళ్లిచేసుకో. సినీ హీరోయిన్‌లా ఎందుకొచ్చిన ప్రేమలూ, సఫలం కాకపోతే విషాద గీతాలూను.'

'చాల్లే! ఏదో స్నేహితురాలవని చెప్తే బోడి సలహా చెప్పావు' కోపంగా వెను తిరిగింది రాధ 'ఆఁ ఆఁ నిలు నిలు నిలునిలూ నా కోసం. తగ్గించాలి నీ కోపం. హల్లో! నిలు!!' పాడుతూ వెళ్లి చేయిపట్టి ఆపింది మంజు. విసురుగా వచ్చి కూచుంది రాధ.

'అలిగితివా! సఖీ! ప్రియా కలత మానవా!'

'నీకుచెప్పటం శుద్ధ దండగ. ఎప్పుడూ సినిమా గోలేగాని మనుషుల్ని అర్థం చేసుకోలేవు' రోషంగా అంది రాధ.

'అది సరే! మరి మధు ఏమంటున్నాడట!' మళ్లీ అసలు విషయంలోకి వస్తూ సాలోచనగా అన్న మంజు మాటలకు కోపం ఎగిరిపోగా మళ్లీ జాలిగా మొహం పెట్టి అంది రాధ — 'ఏమో! మధు మనసేమో నాకు తెలియదు. ఒకవేళ మధు మన పార్టీయే అయినా లాభం లేదు మంజూ! మా వాళ్లంతా నాకు వేరే ఎక్కడైనా మరో సంబంధం చూస్తారుగానీ ఆ రవిని మాత్రం చేసుకోనివ్వరు. రవీ వాళ్లదీ మావూరే! వాళ్లకీ మాకూ ఏవో పార్టీ కక్షలూ అవీ వున్నాయి.'

'ముందు మనం మధు అభిప్రాయం తెలుసుకొని తర్వాతేంచెయ్యాలో ఆలోచిద్దాం, ఏం?'

* * *

ఆ రోజు రాధ ఎవరో ఫ్రెండ్ ఇంటికెళ్లింది. ఏం తోచటం లేదు. 'గోదారీ గట్టుంది. గట్టుమీద చెట్టుంది'— పాడుకుంటూ కూచుంది మంజు.

'చెట్టుప్రక్కని పిట్టుంది. పిట్ట మనసులో ఏముందో' అంటూ వచ్చాడు మధు. మధు మంచితనం కలుపుగోరుతనం చూచి అతనితో చనువుగానే వుంటూంది మంజు. అతన్నిచూసి నవ్వుతూ అందామె— 'ఆరునెలలు సహవాసం చేస్తే వారే వీరు వీరే వారు అవుతారుట. ఈ నెల రోజులకే డాక్టరుగారు నాలా రాగాలారంభిస్తున్నారే!'

'మరో నెలరోజులకు మీరు నాలా రోగాలు నయంచేస్తారేమో' కొంటెగా చూస్తూ అన్నాడు.

'ఉహూఁ నేను కాదుగానీ మీతో జీవితాంతం సహవాసం చేసే మీ కాబోయే శ్రీమతిగారే తమ రోగాలుకూడ నయం చేయవచ్చు.'

'అలాగా! ఎవరబ్బా! నాకే తెలియని నా కాబోయే శ్రీమతి' ఆలోచనా భంగిమలో ముఖంపెట్టి అన్నాడు మధు.

'ఎవరా? నాతో చెప్పించుకోవాలనా! సరే, చెబుతున్నా వినండి. కుమారి రా... కాదు కాదు, శ్రీమతి రాధా మధుబాబు. సరేనా!' క్రీగంట చూస్తూ చెప్పింది మంజు, అతని మనోభావాలు కనుక్కోవాలని ప్రయత్నిస్తూ.

కొంతసేపు నిశ్శబ్దం ఆవరించింది. అతనిముఖంలో చిలిపితనం పోయి గంభీరత చోటు చేసుకుంది. కానీ అతని ముఖంలో ఏ భావాలూ కనుగొనలేక పోయిందామె. తర్వాత గంభీరంగా అన్నాడు మధు 'పొరపడుతున్నారు మంజూ! నేను రాధను పెళ్లి చేసుకోవటం లేదు.'

'ఏమిటీ!' ఆశ్చర్యంగా చూసిందామె.

'అవును మంజూ! నాకు తల్లిదండ్రులు చిన్నప్పుడే పోవటం వలన అత్తయ్యా, మామయ్యా చేరదీసి పెంచి చదివించేరు. రాధ, నేను చిన్నప్పటినుండీ ఒక్కచోటే పెరిగాం. మాకు పెళ్ళంటే నాకు హాస్యాస్పదంగా కన్పిస్తూందెందుకనో. ఒకవేళ రాధకి ఆ వుద్దేశ్యం వుంటేమాత్రం క్షమార్హుడిని.'

ఎగిరి గంతేసినంత పనిజేసింది మంజు. 'వ్వాట్! అయితే మీరు మా పార్టీయేనన్నమాట. హమ్మయ్య ఒకసమస్య తీరింది.'

'సమస్యేమిటీ' — ఈ సారి ఆశ్చర్యపోవటం మధు వంతయింది.

రాధ చెప్పినదంతా మధుతో చెప్పి 'ఇప్పుడు మన నలుగురి అభిప్రాయాలూ ఒకటే కనుక ఒకపెద్ద ప్లాన్‌వేసి రవి వాళ్ల వాళ్లకూ, రాధ తల్లిదండ్రులకూ ఒకనాటకం ఆడించాలి. ఫలితం రాధా రవి

కొంటుల పెళ్ళికావాలి. ఏమంటారు?'

'మీరజాలగలనా తమ యానతి' ఆమె వనుకరిస్తూ, నవ్వుతూ లేచాడు మధు.

*  *  *

ఆ రోజు పార్కులో స్నేహ చతుష్టయం కలుసుకున్నారు. ప్రశాంతంగా వుంది వాతావరణం. ఎవరూ ఉత్సాహంగా వున్నట్టు లేరు.

'మంజూ !'

'ఏం రాధా !' మోకాళ్ళ చుట్టూ చేతులు పెనవేసి కూచుని తాపీగా ప్రశ్నించింది మంజు.

'రేపటి నుండి సెలవులిచ్చేస్తున్నారు. ఈ సెలవులలోనే నా పెళ్ళి చేసేస్తారంటారో ఏమిటో ! మా వాళ్ళు. సెలవులకు వూరెళ్ళటానికే భయం వేస్తూంది. ఏంచేయాలో తోచటం లేదు. ఏంచేదాం?'

'నాకూ ఏం తోచటం లేదు.' నిర్లక్ష్యంగా అంది మంజు. కొంతసేపు నిశ్శబ్దంగా గడచింది. 'అంతా భ్రాంతియేనా. జీవితానా వెలుగింతేనా. ఆశా నిరాశేనా ! మిగిలేదీ చింతే...' శూన్యంలోకి చూస్తూ సినీ హీరోయిన్‌లా ముఖం పెట్టి, రాధను ఉడికించేలా పాడేస్తూంది మంజు.

కన్నుమంది రాధ 'ఏంచేయాలో తోచక నేనేడుస్తూంటే నీకు సంతోషంగా వుంది కాబోలు. రాగాలు తీస్తున్నావు.'

'ఎందుకలా కోప్పడతావూ ! ఇదేం కామెడీపాంగి కాదుకదా ! ఊఁ...' మూతి

# ప్రేమ-పన్నాగం

సున్నాలా చుట్టి, ఒక్కో అక్షరం వత్తి పలుకుతూ దీర్ఘంగా అన్న మంజు మాటలకు అందరితోపాటు రాధకూడ నవ్వేసింది.

'ఆఁ. ఐడియా!' ఉన్నట్టుండి గట్టిగా అంది మంజు.

'ఏమిటండీ! ఏమిటి ? ఏ కొంప మునిగింది ?' నవ్వులాపి ఆత్రంగా ప్రశ్నించేరు మిగిలిన శ్రోతలు.

'రవిగారూ ! మీ యింటి అడ్రస్ వోసారి ఇస్తారా?' సీరియస్‌గా అడిగిందిమంజు.

'ఎందుకండీ ?' ఆమె కొచ్చిన ఐడియాకి అడ్రసేం చేస్తుందో అర్థం కాలేదతనికి.

'కావాలి.'

చెప్పాడు రవి. 'ఇప్పుడు మీరు చేయవలసిందేమిటీ అంటే' మెల్లిగా అందరికీ చెవిలో చెప్పింది మంజు. 'తర్వాత దీనివల్ల తాత్కాలికంగా కొందరు బాధపడ్డా ఇంతకు మించి చేసేదేం లేదు' అంది.

'క్వయిట్ వో. కె. మంజుగారూ' రవి అంగీకరిస్తూ తలవూపేడు.

'మీ బ్రెయిన్ బ్రహ్మాండమైనది'మధు ప్రశంసించాడు.

'బ్రహ్మాండం కాకపోయినా మీ చికిత్స అనవసరం లెండి' జవాబుగా అంది మంజు. నవ్వుతూ లేచారంతా.

*  *  *

సెలవులిచ్చినా రవి వాళ్ళవూరు వెళ్ళలేదు. చావడిలో కూచుని వున్నారు రవి తండ్రి వెంకట్రామయ్యగారు. 'కొడుకు శలవులకు రాకపోవడానికి కారణమేమిటా'ని ఆలోచిస్తున్నారాయన.

'రవిగారి ల్లిదేనాండి ?' వో అమ్మాయి ప్రవేశిస్తూ అడిగింది.


'అవునూ. ఎవరమ్మా నీవు ?'

'నా పేరు మంజుల. రవి క్లాస్‌మేట్‌నండీ. రవిగారిప్పుడు హాస్పిటల్‌లో వున్నారు...' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా, కూచుని వున్నవారు కాస్త హఠాత్తుగా లేచినుంచుని ఆత్రంగా అడిగారాయన 'మా రవా ! హాస్పిటల్ లోనా ! ఏం జరిగిందీ ?'

'ఏం లేదండీ ! మీ అబ్బాయి కథలు రాస్తుంటారు కదండీ, పాపం రోడ్డుమీద నడుస్తూకూడ ఆలోచిస్తూంటారు కాబోలు. ఉన్నట్టుండి ఒక కారు పరధ్యానంగా నడుస్తున్న మీ అబ్బాయి ప్రక్కనుండే దూసుకు పోయింది. కారు తాలూకా ఆచూకీ దొరకలేదు. యాక్సిడెంట్ కాగానే రివ్వున దూసుకు పోయింది కారు, ఎక్కువ జనసంచారం లేని రోడ్డుమీద. అదే దారిలో మా స్నేహితురాలొకామె వెళ్తూ వెళ్తూ అతన్నిచూసి చుట్టుపక్కల కొందరి సాయంతో హాస్పిటల్‌లో జాయిన్ చేయించింది. ప్రమాదకరమైన దెబ్బలు తగల్లేదు కానీ శరీరంలోంచి చాలా రక్తం పోయినందువల్ల రక్తంలవసరమన్నారు డాక్టర్లు. మా ఫ్రెండ్ పాపం తన రక్తంకూడ ధార పోసి మీ అబ్బాయిని బ్రతికించింది. ఇప్పుడు బాగానే వున్నారు. మా వాళ్ళిక్కడ వున్నారు. శలవులలో ఇక్కడికి నేను రావటం తెలిసి రవిగారు వారి ఇంటి అడ్రసిచ్చి మీకీ విషయం చెప్పమన్నారు. ఈ వుత్తరంకూడ యిమ్మన్నారు.'

అందుకున్నారు వెంకట్రామయ్యగారు. అప్పటికే ఆయన కంట్లోనుండి నీరుకారి పోతూంది. అవును పాపం. ఒక్కగా నొక్క కొడుకు మరి. అపరిమితమైన జాలి కలిగింది మంజుకి.

కన్నీటి పొరల్లోంచి అతనా కాగితాన్ని చదివేరు. 'నాన్నా ! అన్ని సంగతులూ గ్రహించేవుంటా రీపాటికి. ఈ సెలవులకి ఇంటికి రాకపోవడానికి కారణం కూడ అదే.



ఒకమ్మాయి నా ప్రాణాలు కాపాడింది. ఆమెకు ఏమిచ్చినా రుణం తీరదు. ఇక వుంటాను...మీ రవి.' 'అవును బాబూ! ఆమెకు ఏమిచ్చినా రుణం తీరదు. మన కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలి' స్వగతంగా అన్నట్టు పైకే అనేసా రాయన.

ఏదో చెప్పబోతూన్నట్టు ఇంకా నిల్చుని ఆయనవైపు పరిశీలనగా చూస్తూన్న ఆమెను ప్రశ్నార్థకంగా చూశారాయన. కొంచెం సందేహిస్తున్నట్టుగా అంది మంజు 'చూడండి! ఒకచిన్నకోరిక. మీ కృతజ్ఞత నెలా చూపాలో నేను చెప్తాను. దయచేసి వింటారా?'

'సందేహించకుండా చెప్పమ్మా!'

'మీ అబ్బాయి తన కృతజ్ఞత నింకోలా చూపాలని ప్రయత్నిస్తున్నారు'

కొంచెం ఆగి మళ్లీ అందామె 'మీరు... అంగీకరిస్తారా?'

'వివరంగా చెప్పమ్మా! భయపడుతున్నావేం?'

'రవిగారు మా ఫ్రండ్‌ని పెళ్లి చేసుకోవాలను కుంటున్నారు. మీరు...'

'తప్పకుండా అంగీకరిస్తానమ్మా' సంతోషంగా అందుకుని అన్నారాయన.

'ఆమె ఎవరైనా మీ కభ్యంతరం లేదా?' ఆమె సందేహం ఇంకా తీరలేదు.

'చనిపోవలసిన నా కొడుకును బ్రతికించిన దేవత ఎవరైతే ఏముమ్మా. ఆమెది ఏకులమైనా దేవుని సాక్షిగా తప్పకుండా నా రవి కిష్టమైతే ఈ పెళ్లి జరిపిస్తాను. సందేహం ఇప్పటికైనా తీరిందామ్మా?' నవ్వుతూ అన్నారాయన.

'చాలా సంతోషమండీ నే వెళ్లొస్తాను'

'మంచిదమ్మా' కళ్లొత్తుకుంటూ 'అంతా ఈశ్వరేచ్ఛ' అనుకున్నా రాయన.

* * *

రవి రూమ్‌లో మధు, రవి మాట్లాడుకుంటూండగా, వెంకట్రామయ్య గారు ఆదరా బాదరాగా రావడం చూసి ఉలిక్కి పడ్డాడు రవి. మధు ఆశ్చర్యంగా 'ఎవరండీ?' అన్నాడు.

'మా నాన్న'

వెనుతిరిగి వెంకట్రామయ్యగార్ని చూసి 'హా. నాటకం మొదలు పెట్టాలన్న మాట'

వెంటనే చేతులకీ, కాళ్లకీ రెండు మూడు కట్లు కట్టించుకుని మంచంమీద వాలిపోయాడు రవి. వెంకట్రామయ్యగారు ఆత్రంగా వచ్చి కూచుని 'ఎలా వుంది బాబూ!' అని ప్రశ్నించారు. 'హాస్పిటల్ నుండి నిన్ననే డిశ్చార్జి చేశారండి. ఇంకా రెండు మూడు రోజుల్లో కట్లుకూడా విప్పేయవచ్చు. అంతా పాపం ఆ అమ్మాయి దయవల్ల రవి బ్రతికారు.' గబ గబా కంఠతా పట్టేసినట్టు మధు జవాబుచెప్పాడు.


మీ అందమైన శిరోజములకు పోషణ
మరియు పుష్టి అవసరము

బెంగాల్ కెమికల్స్



కాంతర్‌డైన్
హేర్ ఆయిల్

నిడుపాటి నిగనిగలాడే,
మృదువైన కేశములు
పెరుగుటకు సహాయపడును.
ముతికి చేరనీయదు.
రాలిపోవడం నిల్చును.

బెంగాల్
కెమికల్
కలకత్తా * బొంబాయి
కాన్పూరు * ఢిల్లీ

కంటి రక్షణకు, అందమునకు
తప్పకుండా దర్‌బార్ కాజల్
(రిజిస్టర్డ్)
వాడండి




దర్బార్ చాంద (కుంకుం) & కాజల్. తయారు చేయువారు
రాంబీర్ కంపెనీ. బొంబాయి-4 (ఇండియా)

'అపునా బాబూ! అంతా విన్నావా' అన్నట్టు పీడు కూడ నా రవి క్లాస్ మేటా ?'

'కాదు నాన్నా! నా ఫ్రెండ్. అతని పేరు మధు డాక్టరు మధు'

'అలాగా! అన్నట్టు నేను త్వరగా వెళ్ళిపోవాలి మళ్ళీ. బోల్డు పనులున్నాయి వాటన్నిటినీ వెనక్కినెట్టి నిన్ను చూసి పోదామని వచ్చాను.'

'అప్పుడేనా నాన్నా!' వెళ్ళిపోవాలని మన సులో కోరు తూ న్నా మాట వరుసకు

# ప్రేమ-పన్నాగం

అన్నాడు రవి. 'మళ్ళీ త్వరలోనే వస్తాను. నేను దూరంగావున్నా నిన్ను కనిపెట్టుకునే స్నేహితులున్నారు. అదే సంతోషం' మధును ఆప్యాయంగాచూస్తూ అన్నారు. ఆ సాయం త్రమే తిరుగు ప్రయాణం కట్టారాయన. రవి, మధు ఊపిరి పీల్చుకున్నారు.

* * *

సెలవులు గడిచాయి. కాలేజీలు తెరిచారు. సెలవులకు ఇంటికెళ్ళిన రాధ ఆ రోజే హాస్టల్‌కి వచ్చింది. అంతకు ముందు రోజునే వచ్చిన మంజుని అడిగింది. 'ఎంత వరకు వచ్చింది ప్లాన్'

'ఇంతవరకూ బ్రహ్మాండంగా సక్సెస్ అయింది. మరి నువ్వేం చేశావ్ ?'

'నో యస్. నీవు చెప్పటం చేయకపోవడమూనా. సెలవులలో మధుకూడ ఇంటికి వచ్చి మూడు రోజులుండి వెళ్ళాడు. అప్పుడే పెళ్ళి ప్రస్తావన వచ్చింది. మధు మావాళ్ళతో తనకి పెళ్ళి చేసుకోవాలని లేదనీ, రాధకి వేరే సంబంధం చూసుకోమనీ ఏక్కచ్చిగా చెప్పేశాడు. ఎన్నివిధాల చెప్పినా లాభంలేక పోయేసరికి వేరే సంబంధాల కోసం అన్వేషణ మొదలెట్టారు మా నాన్న. వచ్చిన వాళ్ళందరికీ ఏవో వంకలుపెట్టి పంపించాను. అన్నిసార్లూ ఇలాగే జరగడం చూసి విసుక్కుని నాన్నే ఒక సంబంధాన్ని నిశ్చయం చేశారు. అమ్మకికూడ చెప్పినా సంబంధం వద్దని. ఫలితం లేకపోగా, వాళ్ళకి 'నేను మంచిదాన్నికాదనీ, నామీద ఎన్నో వదంతు లున్నాయనీ, మీరు మోసపోతున్నారనీ' ఎవరో వ్రాసినట్టుగా ఓ ఆకాశ రామన్న ఉత్తరాన్ని సృష్టించేను. ఆ సంబంధం అలా ఫెయిల్ అయింది. మరో రెండుసార్లు రెండు సంబంధాల్ని అలాంటి ఆకాశరామన్న వుత్తరాలతోనే వెడగొట్టేను. ఏం చేయను. నానోటితో నన ఎదిరిపార్టీవాళ్ళబ్బాయిని చేసుకుంటానని ఎలా చెప్పడం? చెప్పినా ఫలితం జీరో. ఒక ఆడపిల్ల తనగూర్చి తనే అలా చెడుగా వ్రాసుకోవడం అదే ప్రథమమేమో! ఈ సెలవులలో ఇంటికెళ్ళి నేను చేసిన నిర్వాకం ఇది. నాకింక పెళ్ళి కాదేమోనని భయపడుతున్నారు మావాళ్ళు. ఇప్పుడింక ఎవరడిగినా ఇచ్చేసేటట్టున్నారు. వారి నిస్సహాయస్థితిని చూస్తే బాధ కలుగుతూంది' బాధగా అంది రాధ.

'భేష్ బావుంది. అంతా సవ్యంగా జరుగుతుందిలే' రాధ భుజం తడుతూ అంది మంజు సంతోషంగా.

'అయ్యింది అయ్యింది అనుకున్నది'... అనుకోనిదేదో మిగిలున్నది' అంటూ ప్రవేశించాడు మధు.

'అనుకోనిదేమిటో?' చిలిపిగా ప్రశ్నించింది మంజు.

'తమరు చాలా కష్టపడుతున్నారే! మీకేమిటి లాభం చెప్పండి?'

'తమకు లాభమేగా! ఇష్టంలేని పెళ్ళి నుండి తప్పించేను.'

'పోనీ! ఎలాగు శ్రమ పడ్డారు. ఇంకాస్త శ్రమపడి ఇష్టమున్న పెళ్ళి జరిపించి పుణ్యం కట్టుకోకూడదూ!'

'మీ ఇష్టం ఏమిటో నాకేం తెలుసు' నిర్లక్ష్యంగా అంది మంజు.

'వాళ్ళిద్దరి పెళ్ళికోసం' మనం తంటాలు పడుతున్నాం. వాళ్ళతో పాటు మన పెళ్ళి కూడ జరిగిపోతే కథ సుఖాంతం'—గబగబా అనేసాడు మధు.

'మన పెళ్ళా!' కోపంగా చూసింది మంజు. కొంచెం భయపడ్డాడు మధు. 'అంటే...అంటే మనిద్దరికీ పెళ్ళి అని కాదు నా ఉద్దేశ్యం. మీ పెళ్ళి; నా పెళ్ళి కూడ...అని అంటే... అంతే!' అతని తడబాటు చూసి నవ్వింది మంజు.

రాధ కూడ నవ్వేస్తూ, నాకు తెలుసులే బావా నీ ఉద్దేశం. కానీ మీ యిద్దరికీ పెళ్ళంటే, మంజు వాళ్ళ వాళ్ళని ఒప్పించటానికి మరో నాటకం ఆడాలేమో' అంది.


## పుస్తకములు

6 పుస్తకముల సెట్టు రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) మొదటి పద్ధతులు, (4) 84 ఆసన ముద్రా, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS,
(WAT-7) Beat No. 13, Aligarh.



## ఋణం లభించును

న్యాయమైన వడ్డీ రేటుతో లభించును. మీ ప్రస్తుతపు అత్యవసర ఋణము గూర్చి వెంటనే వ్రాయండి.

The Managing Director,
SARVJIT FINANCIERS PVT. LTD.,
Chowk Fawara, AMRITSAR



ఓం గురవే నమః

# తెలుసుకోదగినవి

ఈ పెద్ద పుస్తకంలో మహాత్ముల జీవితచరిత్రలు, మిమ్ము కడుపుబ్బ నవ్వించే వింత హాస్యాలు, మైమరపించే ప్రేమ విషయాలు, జీవితానికి వెలుగునిచ్చే ఎన్నో విజ్ఞాన విషయాలు, అనేకమంది పెద్దల జీవిత అనుభవాలు, మీకు ఆశ్చర్యాన్నికలిగించే అనేక అద్భుత సంఘటనలు, నవీన ఆరోగ్య రహస్యాలు, అభివృద్ధికి కొత్త దారులు, వింత ప్రేమగాథలు, వివాహ సమస్యలు, వ్యాపార విజయ మార్గాలు, తెలివి సమాధానాలు, అద్భుత మానసికశక్తులు, మహాత్ముల దివ్య సందేశాలు, చరిత్రలో జరిగిన ఘోర ప్రమాదాల వివరాలు, యింకా మీకు ఆనందాన్ని ఉప్పొంగించే అనేక వందల విషయాలున్నాయి. దేశసేవ ప్రచురణలు. ఏలూరు, ఆంధ్రకు వ్రాస్తే, రూ. 5/-లకు వి.పి. పోస్టుద్వారా మీకో పుస్తకం వస్తుంది. చిన్న పెద్దలు తప్పక చదవండి.

[illegible] తల అడ్డంగా తిప్పుతూ మంజు, 'ఆ భయమేం లేదు. మా అన్నయ్యా, వదినా నేనెవర్ని పెళ్లి చేసుకున్నా అడ్డు చెప్పరు. ఉత్తమ ఆదర్శాలు కలవారు. అందులోనూ డాక్టర్లు లాంటి పెద్ద పదవిలో వున్నవారైతే అస్సలు భయపడాల్సిన అవసరం లేదు. నా సుఖమే వారికి కావలసినది.'

వెంటనే అందుకుంది రాధ 'అంటే మా బావను చేసుకోవటం నీ కిష్టమేనన్న మాట!'

పెదవి కొరుక్కుంది మంజు నవ్వును దాచాలని ప్రయత్నిస్తూ, 'అది కాదు రాధా...' అని ఏదో అనబోయింది.

వినిపించుకోనట్టుగా అంది రాధ 'ఏది కాదు. నీ ముఖమే చెప్తోంది నీ మనసును విప్పి.' మూతి తిప్పుతూ ఎక్కిరిస్తూ వెళ్లిపోయింది మంజు.

'రెండో సమస్య తీరింది' ఊపిరి తేలిగ్గా పీల్చుతూ అంది రాధ. నవ్వుకుంటూ హాస్పిటల్‌కి వెళ్లిపోయాడు మధు.

* * *

కాలేజీలో గర్ల్స్ వెయిటింగ్ రూమ్‌లో కూచుని వున్నారు రాధ, మంజు. ఆదరాబాదరాగా వచ్చాడు రవి. 'రాధా! మా నాన్న మళ్లీ వస్తున్నట్టు వుత్తరం వ్రాసారు. మొన్న వొచ్చినప్పుడు పని తొందరలో అప్పటికప్పుడే వెళ్లిపోయారు. నిన్ను పరిచయం చేయటానికి వీలు కాలేదు. మొన్న వొచ్చినప్పుడు మధును చూసినా, చిన్నప్పుడే పై చదువులకోసం దూరంగా వెళ్లిపోయి డాక్టరుగా తిరిగి వచ్చిన మధును పోల్చుకో లేదు. నిన్ను పోల్చుకుంటారు. ఎలా?' నగరుస్తూ అన్నాడు రవి.

'అంటే కథ క్లైమాక్స్‌లో వుందన్న మాట!' మంజు సాలోచనగా అంది.

రాధ మాత్రం కంగారు పడుతూ అంది 'నాకేమిటో భయంగా వుంది. నన్ను చూస్తే ఆయనీపెళ్లికి వప్పుకుంటారా' అని.

'ఓయస్. ధైర్యంగా వుండు' అభయమిచ్చింది మంజు.

ఆ సాయంత్రమే రాధను వెంకట్రామయ్య గార్కి పరిచయం చేశాడు రవి. తుళ్లిపడ్డారాయన. 'ఈ అమ్మాయి గణపతిరావుగారమ్మాయి కదూ?'

'అవును నాన్నా!' [illegible] అన్నాడు రవి.

'ఆ అమ్మాయిని నీవు పెళ్లిచేసుకుంటావా! వాళ్లకీ మనకూ అస్సలు పడదే. వాళ్లది వేరే...' మాట మధ్యలోనే మంజు అందుకుని అన్నది 'చూడండి వెంకట్రామయ్యగారూ! ఆనాడు రాధ మీ రవిని వేరే పార్టీ వ్యక్తని విడనాడివుంటే మీ రిప్పుడు మీ అబ్బాయిని మీ కళ్లతో చూసుకునేవారేనా!'

'అది సరేగాని...'

విసురుగా తల ఎగరేసి అంది 'ఏది సరే! నా కొడుకును బ్రతికించిన దేవత ఎవరైతే నేం? దైవసాక్షిగా ఈ పెళ్లి జరిపిస్తానన్నారు. మాట తప్పుతారా? మీరు పెద్దవారు. మీకు చెప్పతగినదాన్ని కాదనుకోండి.'

వ్యంగ్యంగా వచ్చిన ఈ సమాధానికి చలించిపోతూ అన్నారాయన, 'లేదమ్మా లేదు. తప్పకుండా ఈ పెళ్లి జరుగుతుంది' అనేసి వెను తిరిగా రాయన. తృప్తిగా ఒకరిముఖా లొకరు చూసుకున్నారు ముగ్గురూ. ఆ మరునాడే ఆయన తిరుగు ప్రయాణం కట్టారు స్వంతవూరికి.

* * *

'గణపతిరావుగారూ!'

గణపతి వీధిలోకివచ్చి తమ వాకిట నిలుచునివున్న వెంకట్రామయ్యగార్ని చూసి నిర్ఘాంతపోయేడు. 'ఆఁ మీరా!'

'అవును. నేనే మీతో పనివుండి వచ్చాను. మీ సహాయాన్ని కోరటానికి అన్ని అభిమానాలూ, పంతాలు వదిలి మరీ వచ్చాను. మా అబ్బాయికి మీ అమ్మాయి నిచ్చి పెళ్లిచేయమని అడగటానికి వచ్చాను.' ఒకే వూపులో చెప్పుకు పోయాడాయన. ఆశ్చర్యపోయాడు గణపతి. ధన బలిమిలోనూ, పార్టీ [illegible]లోనూ వెంకట్రామయ్య అధికుడు. పైగా తన కూతుర్ని ఇంతవరకూ ఎవరూ పెళ్లిచేసుకో లేదు. ఏవో పుకార్లతో వచ్చిన సంబంధాలన్నీ వెనక్కి పోతున్నాయి. అలాంటి సమయంలో, తన ప్రతిపక్షి తనకు తానై రావటం మహదాశ్చర్యాన్నే కలిగించింది.

'మీరు నాతో పరిహాసం చేస్తున్నారను కుంటాను' సందేహంగా అన్నాడు.

'అబ్బెబ్బె. అలా ఎప్పటికీ అనుకోకండి' అని మిగిలిన, తనకు తెలిసిన వివరాలన్నీ చెప్పారు. గణపతి చిరునవ్వుతో 'ఏది ఎలా జరగాలని రాసి వుంటే అలా జరుగుతుంది. పెద్దలు పంతాలు పట్టేవారైనా, పిన్నలు పయ్యాన్ని వియ్యంగా మార్చారు' అన్నారు. తరువాత జరగబోయే ఏర్పాట్లను గూర్చి చాలా సేపు చర్చించుకున్నారు మి (శ) త్రు (వు) లిద్దరూ.

* * *

'అల్ సక్సెస్ మంజూ! త్వరలోనే ముహూర్తాలు నిశ్చయించుకున్నట్టు నాన్నగారు వుత్తరం వ్రాసారు. నీ ఋణం ఎలా తీర్చుకోను?' మంజు చేతులు పట్టి గిర్రున తిప్పేస్తూ సంతోషంగా అంది రాధ.

'ఏముంది? మీ బావను త్యాగం చేసేయ్ రాధా' అన్నాడు రవి. అప్పుడే ప్రవేశించారు మధు, రవి కూడ.

'అవును. మా మధును నీ చేతుల్లో పెడుతున్నాను' అంది పెద్ద త్యాగమూర్తిలా ముఖం పెట్టి రాధ.

'ఓహో! పెద్ద త్యాగం.' మూతి తిప్పింది మంజు. అంతా నవ్వుకున్నారు. మంజు గొంతు సవరించుకుంది 'ప్రేమించుట పిల్లలవంతు, దీవించుట పెద్దలవంతు...' మంజు పాటను మిగిలినవారు అందుకున్నారు, 'పెద్దలు కాదంటే అది ప్రణయం కాదని విడదీస్తే అది ప్రళయం...' అని. ●

